కార్యకర్తలే వైఎస్సార్ సీపీ బలం



యలమంచిలిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలే వైఎస్సార్ సీపీ బలమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. యలమంచిలిలోని పుంతల ముసలమ్మ కాపు కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని పుకార్లు లేవనెత్తినా 2024లో పాలకొల్లు ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేస్తానని పాలకొల్లు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తానని శ్రీనివాస్ చెప్పారు. స్థానికేతరుడు అన్న ప్రచారంలో వాస్తవం లేదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకొల్లు నియోజకవర్గంలో భాగమైన వీరవాసరం మండల ఎంపీపీగా పనిచేసిన చరిత్ర తనకుందన్నారు. జెడ్పీ చైర్మన్‌గా తన రాజకీయ భవిష్యత్తుకు బలమైన పునాది వేసిన యలమంచిలి మండలంలో వచ్చే సార్వత్రిక ఎన్నికలలోపు ఇల్లు నిర్మించుకుని నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని ఆయన చెప్పారు. ఇటీవల జరిగిన సమావేశంలో మొదటి దఫా పాలనలో ప్రజల ఉన్నతికి కృషి చేశానని, రెండవ దఫాలో ప్రజలతోపాటు పార్టీ కార్యకర్తలకు కూడా న్యాయం చేస్తానని సీఎం జగనన్న హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ చెప్పారు. కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. సభాధ్యక్షుడు, పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు మాట్లాడుతూ 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా పాలకొల్లులో ఎగిరే వరకు కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని కోరారు. ఎంపీపీ రావూరి వెంకట రమణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయానికి పాటుపడాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ మాట్లాడుతూ విజయమే లక్ష్యంగా అందరూ పని చేయాలని కోరారు. మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు మాట్లాడుతూ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓదూరి భాస్కరరావు, ఉచ్చుల స్టాలిన్, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, గుబ్బల వేణు, చివటపు నాగేశ్వరరావు, బోనం బులి వెంకన్న, మల్లుల బుజ్జి, బొంతు వెంకట కర్ణారెడ్డి, గుర్రాల వెంకట్రావు, కవురు గోపి, పాలంకి శ్రీనివాసరావు, పొన్నమండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కృష్ణ బలిజల సంక్షేమానికి కృషి



కమ్యూనిటీ భవన నిర్మాణానికి పంచాయతీ తీర్మానం అందిస్తున్న సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సీతారామ్

పెనుగొండ: కృష్ణ బలిజ సామాజిక వర్గ సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ తెలిపారు. శుక్రవారం కొడమంచిలి పంచాయతీ కార్యాలయంలో బండివారిపాలెంలో కృష్ణబలిజ సామాజికవర్గ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు స్థలం కేటాయించి తీర్మానం అందించినట్లు తెలిపారు. కొడమంచిలిలో నాలుగున్నర సంవత్సరాలలో నవరత్నాలు పథకంలో సుమారు రూ.45కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. గ్రామ కార్యదర్శి డి నాని, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండేటి రమేష్, చామంతి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

పుష్పరాజ్‌కు సేవా భూషణ్ అవార్డు



నన్నేటి పుష్పరాజ్

పెనుగొండ: మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ సేవా భూషణ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం పుష్పరాజ్ మాట్లాడుతూ సర్వేజనాసుఖినోభవంతు ప్రతిభ పురస్కారాల 2023ల్లో భాగంగా అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు. ఈ నెల 16న హైదరబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య కళా నిలయంలో సాయంత్రం 5 గంటలకు అందించనున్నట్లు అవార్డు ప్రదాత నిర్వాహకులు సూర్యనారాయణ మాస్టారు తెలిపినట్లు తెలిపారు. రిటైర్డు హైకోర్టు జడ్జి చంద్ర కుమార్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేస్తామన్నారు. అవార్డు గెలుచుకున్న పుష్పరాజ్‌ను పలువురు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పెనుగొండ: బేడ, బుడగ జంగాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. 2008 నుంచి బేడ, బుడగ జంగాలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం లేదని, దీంతో ఎన్నో ఇబ్బందులు పాలవుతున్నామని సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆయా సంఘాల నాయకులు తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కలిసి విన్నవించారు. దీనికి స్పందించి సత్వరం కలెక్టరుతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం రూరల్: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని సబ్‌కలెక్టర్ సూర్యతేజ అన్నారు. నరసాపురం మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన బూత్‌లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూలై నెల 21వతేదీనుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు నమోదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఫాజిల్, డిప్యూటీ తహసీల్దార్ నాగదేవి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

గూడెంలో 14.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 15.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ శుక్రవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 9.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి



కాపు నేస్తంకు దరఖాస్తు చేసుకున్నాను. వాటి నిమిత్తం కుల, ఆదాయ ధ్రువపత్రాలు సమర్పించాలని అధికారులు తెలిపారు. రెండు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాను. జగనన్న సురక్షలో నాకు రెండు దరఖాస్తులు వచ్చాయి. అవి ఇచ్చే సమయానికి నాకు ఆరోగ్యం బాలేదు. వాటిని ఎవరినైనా తీసుకురమ్మని చెపుదామంటే నేను వెళ్లి సంతకం చేస్తేనే గాని దరఖాస్తులు ఇవ్వరు. ఆ సమయంలో మా వలంటీర్ పిన్ని దేవిశ్రుతి దేవతలా వచ్చి సహాయం అందించి సమస్యను పరిష్కరించింది. వలంటీర్ల సేవలు ఎనలేనివి, వారిని కించపర్చేలా మాట్లాడటం సరికాదు.

– యర్రా సుగుణ, గృహిణి, పాలకొల్లు, 15వ వార్డు

వరద సమయంలో ఆదుకున్నారు



యలమంచిలి: వరదల సమయంలో ఏనుగువానిలంక గ్రామంలోని పాత హరిజనపేట కొత్త కాలనీలో ఉన్న మా ఇళ్లన్నీ మోకాలి లోతు ఇళ్లలో మునిగిపోయాయి. పొయ్యి వెలిగించే ఆస్కారం లేక ఆర్థాకలితో అలమటిస్తున్న సమయంలో మా గ్రామ వలంటీర్లు వరద నీటిలో నడుచుకుంటూ వచ్చి ఆహారం అందజేశారు. పగలనక, రాత్రనక రెండు పూటల ఆహారం అందించి ఆదుకున్నారు. వలంటీర్ల సేవలను అందరూ గౌరవించాలి.

– సోమాల సంసోను, ఏనుగువానిలంక, కొత్త కాలనీ

ఛాంబర్ కళాశాలలో నేడు, రేపు మెగా జాబ్ మేళా



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు

పాలకొల్లు సెంట్రల్: ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చైర్మన్ కారుమూరి నరసింహారావు తెలిపారు. శుక్రవారం స్థానిక బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీల్లో ఈ రెండు రోజులు కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో మొత్తం 18 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. జిల్లాలో పాలకొల్లుతోపాటు తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నరసాపురం, ఆచంట, ఉండి, తూర్పుగోదావరిలో అమలాపురం నియోజకవర్గాల్లో ఉన్న అన్ని కళాశాలలకు ఈ జామ్ మేళాలో పాల్గొనేందుకు సమాచారం అందించామన్నారు. ఈ రెండు రోజుల్లో సుమారు వెయ్యి మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థుల అర్హతలు ఇంటర్, బీఎస్సీ, బి కామ్, బీబీఏ, బి టెక్, ఎంసీఏ, ఐటీ ఇంజనీరింగ్స్, ఫార్మసీ, బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తయిన విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు తమ పాస్‌పోర్ట్ ఫొటోలతో పాటు, ఒరిజినల్, జిరాక్స్ విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరవ్వాలన్నారు. పూర్తి వివరాల కోసం 9701394660, 9063629521, 08814–229521 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు, ట్రెజరర్ జల్లూరి రామలింగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

28, 29న మహిళలకు శిక్షణ



మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న వీహెచ్‌పీ సభ్యురాలు సునీత

పాలకొల్లు సెంట్రల్: మాతే సమాజ నిర్మాత అని అటువంటి మాతను గౌరవించుకోవాలసిన అవసరం అందరిపైనా ఉందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మహిళా సంయోజక్ టి సునీత అన్నారు. శుక్రవారం స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావి చెరువుగట్టున కొలువై ఉన్న శ్రీ ముఖధారమ్మ ఆలయంలో లలితా మహిళా మండలి సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో ద్వారకాతిరుమలలో మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ సమావేశాలకు ఆధ్యాత్మిక హిందూ సంఘాలన్నీ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కుంపట్ల చిన్నరాజా, సెక్రటరీ చినిమిల్లి బాబి, సభ్యులు బొర్రా చినబాబు, లలితా మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఏయూ లా తృతీయ ఫలితాల్లో యువకుడి ప్రతిభ



కొండేటి సోమశేఖర్

పాలకొల్లు సెంట్రల్: ఆంధ్రా యూనివర్సిటీలో లా విద్యనభ్యసిస్తున్న పాలకొల్లుకి చెందిన విద్యార్థి కొండేటి సోమశేఖర్ తృతీయ సంవత్సరం ఫలితాల్లో 7.68 సీజీపీఏతో మొదటిస్థానం సాధించాడు. పట్టణంలోని చిత్రావిచెరువు గట్టు ప్రాంతానికి చెందిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో గుమస్తాగా పనిచేస్తున్న కొండేటి రామకృష్ణ, మాలతి దంపతుల కుమారుడు సోమశేఖర్ శుక్రవారం విడుదలైన లా మూడో సంవత్సరం ఫలితాల్లో ప్రథమస్థానం సాధించాడు. సోమశేఖర్ విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగింది. పాలకొల్లు ఏఎస్ఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకుని ప్రథమస్థానంలో నిలిచాడు. ఆంధ్రా యూనివర్సిటీలో లా కళాశాలలో ఫ్రీ సీటు సాధించాడు. మూడేళ్లుగా లా పరీక్షల్లో మొదటి సంవత్సరం 7.54 సీజీపీఏ, ద్వితీయ సంవత్సరం 7.62 సీజీపీఏ, మూడవ సంవత్సర పరీక్షల్లో 7.68 సీజీపీఏ సాధించాడు. వరుసగా మూడేళ్లు యూనివర్సిటీ స్థాయిలో ప్రథమస్థానం సాధించాడు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.జి.వి.డి ప్రసాద్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ న్యాయమూర్తి కావాలనేది తన జీవిత లక్ష్యమని తెలిపాడు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదు



జిన్నూరులో వృద్ధులకు కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

పోడూరు: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని జిన్నూరు సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి అన్నారు. జిన్నూరు పంచాయతీ వద్ద శుక్రవారం పాలకొల్లు నేత్ర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ బేబీ మహలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద వృద్ధులకు అందుబాటులో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం పట్ల నేత్ర కంటి ఆసుపత్రి వైద్యులను, సిబ్బందిని అభినందించారు. నేత్ర కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శిబిరంలో పాల్గొన్న రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ జమ్ము మృత్యుంజయరావు, పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు, అప్పాజీ, రెడ్డి అంజిబాబు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, ముందస్తుగా రైతులు కొనుగోలు చేయవద్దని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వరి నాట్లు, వరి పొలాలను ఆయన పరిలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ నాట్లు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాట్లు వేసిన 40 రోజుల లోపు కాంప్లెక్స్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. యూరియా అధికంగా వాడవద్దన్నారు. ఆయ న వెంట ర్యాలీ సూర్య, చినసత్యనారాయణ, బుర్రె నాగేశ్వరరావు, చేదూరి పాండు, ఏఈవో వర్మ, వీహెచ్ఏలు దుర్గ, ప్రవీణ్ ఉన్నారు.

చిల్డ్రన్ హోంకు బియ్యం అందజేత

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని కొండయ్య చెరువు సమీపంలోని లార్డ్ ఆఫ్ లివింగ్ చిల్డ్రన్స్ హోమ్‌లోని అనాథ పిల్లలకు శుక్రవారం లయన్ కోనా కళ్యాణి సౌజన్యంతో వశిష్ట లియో క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం, 25కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దాతలు సహృదయంతో ఆశ్రమాలకు ఇతోధిక సాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ ఆకాశం సాయిశ్రుతి, కుందుం వెంకటేశ్వరరావు, మోటూరి వెంకటరత్నం, యర్రా ఆంజనేయస్వామి, మాధురి, దర్గావెంకట సాయిలక్ష్మి, విజదుర్గా అంబికా శిరీషా తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు దిశ ప్రొటెక్షన్

తాడేపల్లిగూడెం రూరల్: మహిళల భద్రతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ రాష్ట్ర కోశాధికారి కొల్లా విజయలక్ష్మికుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావుపాలెం గ్రామంలో కొత్తగా చేరిన సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వెలివెల ఫీడర్‌పై విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ బి పూర్ణచంద్రశేఖరరావు తెలిపారు. ఈ కారణంగా దగ్గలూరు పంచాయతీ పరిధిలోని శ్రీలంక కాలనీ, పెదపేట, మర్రిపుంత, చంద్రరావు గారి తోట, శివాలయం వీధి, గౌడ వీధి, చినపేట, జగనన్న లే అవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు పాలకొల్లు రూరల్‌లో జగనన్న సురక్ష

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ పంచాయతీ యాళ్లవానిగరువు సచివాలయ ఆవరణలో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు 24, 25, 26, 27వార్డులకు సంబంధించి హౌసింగ్‌బోర్డు సచివాలయ ఆవరణలో గ్రామసభలు నిర్వహిచనున్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామ సభలు

మొగల్తూరు: మండలంలోని కొత్తోట, కొత్తపాలెం సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న గ్రామ సభలు నిర్వహించనున్నారు. కొత్తోట సచివాలయ పరిధిలో తహసీల్దార్ జి అనితాకుమారి, కొత్తపాలెం సచివాలయ పరిధిలో ఎంపీడీవో వి బాబ్జి రాజు పర్యవేక్షణలో గ్రామ సభలు నిర్వహిస్తారు.

నేడు గ్రామాల్లో 'జగనన్న సురక్ష'

నరసాపురం: నరసాపురం, మొగల్తూరు మండలాల్లో శనివారం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాలలో చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొననున్నారు. చీఫ్‌విప్ కార్యాలయం నుండి అందిన సమాచారం మేరకు మొగల్తూరు మండలంలోని కొత్తోటలో 9.30 గంటలకు కొత్తపాలెంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమంలోను, మధ్యాహ్నం 2గంటలకు నరసాపురం పట్టణంలోని 12,13 వార్డు సచివాలయాల వద్ద నిర్వహించే కార్యక్రమంలో, మధ్యాహ్నం 3గంటలకు చామకూరిపాలెం, 4గంటలకు పసలదీవి గ్రామంలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

నేడు యలమంచిలి, చించినాడలో సురక్ష సభలు

యలమంచిలి: మండల కేంద్రం యలమంచిలి, చించినాడ గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష సభలు నిర్వహిస్తున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ ఓదూరి భాస్కరరావు తెలిపారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఈ సభల్లో పాల్గొంటారని ఆయన వివరించారు.


ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

పాలకొల్లు అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని ఆక్వా రైతులు కోరారు. ఆక్వా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని చందపర్రులో శుక్రవారం నిర్వహించిన ఆక్వా రైతుల సమావేశంలో నేతలు మాట్లాడారు. పాలకొల్లు, నరసాపురం, భీమవరం, అమలాపురం, రాజోలు ప్రాంతాల ఆక్వా రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆక్వా రైతుల సమస్యలపై త్వరలో వినతి పత్రం సిద్ధం చేసి ప్రజా ప్రతినిధుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. ప్రభుత్వాలు రొయ్యల ధరలు నియంత్రించి ఆక్వా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించక పోతే ఉభయగోదావరి, కృష్ణాజిల్లాల రైతులంతా క్రాప్ హాలీడే ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సమావేశంలో జీజీబీ రాజు, జి.శ్రీనివాసరావు, ఎస్.మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయండి

తాడేపల్లిగూడెం అర్బన్ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిర్వహిస్తున్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర శుక్రవారం తాడేపల్లిగూడెం చేరుకొంది. పట్టణంలోని పలుహాస్టళ్లను పరిశీలించారు. బీసీ వసతిగృహంలోని బాలికలతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ పావని విద్యార్థినులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవార్లు



పెనుగొండలో శాకంబరి దేవిగా దర్శనం ఇచ్చిన వాసవీ మాత



కూరగాయలతో శాకంబరీదేవి అలంకరణలో దుర్గమ్మ

పెనుగొండ: ఆషాఢమాసం సందర్భంగా పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత, మహిషాసురమర్దనీ అమ్మవార్లు శాకంబరీ దేవిగా దర్శనం ఇచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో, వాసవీ శాంతి థాంలో అభిషేకాలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కూరగాయలతో అమ్మవార్లను అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు.

శాకంబరి అలంకరణలో దుర్గమ్మ

నరసాపురం రూరల్: నరసాపురంలోని రాయపేటలోని కనకదుర్గమ్మవారిని శుక్రవారం శాకంబరీ దేవిగా అలంకరించారు. కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త విన్నా మల్లికార్జునరావు, నాగకల్యాణి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్దెత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులను పాటించాలి

నరసాపురం రూరల్: రైతులు మేలైన వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చునని ఏడీఏ ఈదా అనిల్‌కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పుతాళ్లు రైతు భరోసా కేంద్రంలో జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి వ్యవసాయ సలహామండలి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులకు సార్వా పంటకు సంబంధించి పాటించాల్సిన వ్యవసాయ పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా ఎడ్వయిజరీ బోర్డు చైర్మన్ కాండ్రేగుల నరశింహారావు, బోర్డు మెంబరు బండారు ఇస్సాకు, చిట్టవరం సర్పంచ్ తాడి లక్ష్మణరావు మాట్లాడుతూ తరచూ సార్వా పంట సమయంలో ముంపునకు కారణమవుతున్న కాలువల వివరాలు తెలిపారు. రైతుల సమస్యలను మినిట్స్ రూపంలో రికార్డులో నమోదు చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి ఎం సామ్యూల్ జాన్సన్, ఇరిగేషన్ ఏఈ మోహన కృష్ణ, ఎఫ్‌డీవో భారతి, ఏఈవో ఇబ్బా లక్ష్మీనారాయణ, వీఏఏ కేదారి పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

మొగల్తూరు: కాళీపట్నం పడమరలో శనివారం హెర్మోన్ లివింగ్ వాటర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహికులు రెవ జోషఫ్ రాజు కోమన పల్లి, స్వర్ణగీత కోమన పల్లి తెలిపారు. గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్యులు ఈ శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందిస్తారని, గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.